క్లుప్తంగా

దోమల నివారణ అందరి బాధ్యత



చేబ్రోలు పీహెచ్‌సీలో వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న డా. వర్మ

ఉంగుటూరు: దోమల నివారణ అందరి బాధ్యత అని ఉంగుటూరు చేబ్రోలు పీహెచ్‌సీ డాక్టరు సుబ్బరాజు వర్మ అన్నారు. మంగళవారం చేబ్రోలు కాగుపాడు ఆరోగ్య కేంద్రాల వద్ద వైద్యసిబ్బందికి ఆశావర్కర్లుకు దోమలు నివారణపై అవగాహన కల్పించారు. మలేరియా సబ్‌యూనిట్ అధికారి వైపీ లక్ష్మణరావు మాట్లాడుతూ కీటక జనిత వ్యాధులు- ముందుస్తు కీటక నియంత్రణ చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చేబ్రోలు, కాగుపాడు పీహెచ్‌సీ వైద్యుడు శ్రావణ్‌రెడ్డి, డా.పి. మానస, డా. శిరీష, ఆరోగ్య విస్తరణాధికారి కె. శ్రీనివాసరావు, సామాజిక ఆరోగ్య అధికారి కె. రత్నరాజ్యం, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వ భద్రత



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం: పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించి, ఉచిత వైద్యం అందిస్తుందని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన వివిధ వ్యాధులకు సంబంధించి వైద్యం చేయించుకున్న వారికి రూ.12 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు ఉచితంగా ఖరీదైన, అత్యవసర వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సుమారు 3వేల రకాల రోగాలను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తెచ్చి ప్రతి పేదవాడికి ఉచితంగా వైద్యం పొందే అవకాశం కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో గణపవరం మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దండు రాము, జిల్లా వ్యవసాయ సలహా సంఘం చైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు కాకర్ల శ్రీను, రొంగల శ్రీను, కొండేటి వెంకటరత్నం, చనుమూరి శివ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కొఠారు పరామర్శ

దెందులూరు: కొల్లి కాంతమ్మకు మెరుగైన వైద్య సేవలందించి త్వరితగతిన ఆరోగ్యం కోలుకునేలా చూడాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి కోరారు. మంగళవారం ఏలూరు ఆయుష్ వైద్యశాలలో పెదవేగి మండల పెదకడిమి గ్రామానికి చెందిన కొల్లి కాంతమ్మ ఆరోగ్య పరిస్థితి, వైద్య సేవలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గంటా ప్రసాదరావు, దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన్న ప్రసాద్ ఉన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం

భీమడోలు: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధమని భీమడోలు తహసీల్దార్ ఎం.ఇందిరాగాంధీ అన్నారు. భీమడోలు తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ప్రత్యేక సంక్షిప్త సవరణ 2024పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత నెల 21 నుంచి ఈనెల 21వ తేదీ ఓటర్ల ఇంటింటి సర్వే పారదర్శకంగా జరుగుతుందన్నారు. మండల వ్యాప్తంగా 53 పోలింగ్ కేంద్రాలున్నాయన్నారు. డిప్యూటీ తహసీల్దార్ షంషూద్దీన్, వివిధ పార్టీల నాయకులు రామకుర్తి నాగేశ్వరరావు, ఉండవల్లి బాలానందం, యర్రంశెట్టి ఏడుకొండలు, ప్రవీణ్‌కుమార్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

నాచుగుంటలో పొలంబడి

ఉంగుటూరు: ఇటీవల కురిసిన వర్షాలకు నీట మునిగిన పంట పొలాలు తేరుకోవడానికి బూస్టర్ డోస్‌గా 20 కిలోల యూరియా, 10కిలోల ఎంవోపీ ఎరువులు ఎకరాకు వేయాలని మండల వ్యవసాయ అధికారి బాలిన వెంకటేష్ రైతులకు సూచించారు. మంగళవారం నాచుగుంట ఆయకట్టులో పొలంబడి నిర్వహించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏవో వెంకటేష్ మాట్లాడుతూ భూసార పరీక్ష ఫలితాలు అనుసరించి ఎరువులు వాడుకోవడం వల్ల ఖర్చు తగ్గించుకుని పంట పండించవచ్చునన్నారు. వరిలో పంటలో కలుపు నివారణకు సూచనలు అందించారు.

'ఆడుకుందాం ఆంధ్ర' క్రీడల రిజిస్ట్రేషన్లు ప్రారంభం

దెందులూరు: మండల పరిధిలో ఆడుకుందాం ఆంధ్ర క్రీడలకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమైందని దెందులూరు ఎంపీడీఓ ఏబీపీవీ లక్ష్మి తెలిపారు.17 ఏళ్లు నిండిన యువతీ యువకులు గ్రామ సచివాలయంలో రిజిస్ట్రేషన్లు చేస్తున్న విషయాన్ని గమనించాలన్నారు. మంగళవారం దెందులూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ క్రికెట్ తదితర క్రీడల్లో పోటీలు నిర్వహిస్తున్నామని, యువత సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు.

విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక పథకాలు

- రూ.210 కోట్లతో దివ్యాంగులకు త్రిచక్ర మోటార్ వాహనాలు
- దివ్యాంగుల వయోవృద్ధుల కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ఇంతియాజ్



దెందులూరులో విభిన్న ప్రతిభావంతుల త్రిచక్ర మోటార్ వాహనాలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ఇంతియాజ్

దెందులూరు: ప్రజలందరికీ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు విభిన్న ప్రతిభావంతులకు సైతం తారతమ్యం లేకుండా అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ. 210 కోట్లతో 175 నియోజకవర్గాల్లో రాష్ట్ర వ్యాప్తంగా 1,550 త్రిచక్ర మోటార్ వాహనాలను మంజూరు చేశారని, వాటిని లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నట్టు విభిన్న ప్రతిభావంతుల వృద్ధుల సంక్షేమ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ఇంతియాజ్ అన్నారు. మంగళవారం దెందులూరులోని ఎంపీడీఓ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అధ్యక్షతన దెందులూరు నియోజకవర్గస్థాయి విభిన్న ప్రతిభావంతులకు త్రిచక్ర మోటార్ వాహనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విభిన్న ప్రతిభావంతులకు త్రిచక్ర మోటార్ వాహనాల పంపిణీ, పెన్షన్‌తో పాటు వారి జీవన విధానం, భద్రత, అభివృద్ధి సంక్షేమానికి కట్టుబడి ఉన్నారన్నారు. దెందులూరు నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో 10 మంది లబ్ధిదారులకు వాహనాలను పంపిణీ చేయడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. నియోజకవర్గంలో త్రిచక్ర మోటార్ వాహనాలు ఇవ్వాల్సిన వారికి ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ, రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు అనంతరం ఇవ్వడం జరుగుతుందన్నారు. విభిన్న ప్రతిభావంతుల అందరి తరపున సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపీలోనే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలవుతున్నాయన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శంగా మారిందన్నారు. ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి మరోసారి దెందులూరు నియోజకవర్గంలో ఘన విజయం సాధించడం, మంత్రి కావడం తథ్యమన్నారు. నియోజకవర్గ ప్రజలందరూ అబ్బయ్యచౌదరికి పూర్తి సహాయ సహకారాలు, మద్దతు ప్రకటించాలని కోరారు. అనంతరం కార్పొరేషన్ ఇంతియాజ్, ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, వైస్ చైర్మన్ పీ.విజయ్‌బాబు, ఎఎంసీ మాజీ చైర్మన్ మేకా లక్ష్మణరావు, జెడ్పీటీసీలు నిట్టా లీలానవకాంతం గంగరాజు, మండలి సరస్వతి కొండలరావు, ఎంపీపీలు బొమ్మనబోయిన సుమలత, బత్తుల రత్నకుమారి, తాతా రమ్యశ్రీ, పెన్మెత్స శ్రీనివాసరాజు, విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారి ట్రస్టు బోర్డు డైరెక్టర్ తొత్తడి వేదకుమారి, పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, గ్రామ అధ్యక్షుడు పోకల రాంబాబు, పార్టీ జిల్లా కార్యదర్శులు కట్టా ఏసుబాబు, చల్లా మేరీరాజు, కొంగర రత్నకుమార్ అబ్బాస్, పిళ్లెం శ్యాం తంబి, ఏఎంసీ డైరెక్టర్ పులిపాటి శ్యామలాదేవి, సర్పంచ్ తోట ఏసమ్మ, ఎంపీటీసీలు పులిపాటి ఆనంద్, తోట విజయకుమారి, తాళ్ళూరి నాగరాజు, నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కచ్చితమైన తూకంలో లబ్ధిదారులకు రేషన్ సరుకులు



పాతూరులోని ఎంఎల్‌ఎస్ పాయింట్‌ను తనిఖీ చేసిన డీఎస్‌వో సత్యనారాయణరాజు

భీమడోలు: ప్రజా పౌర సరఫరాల విభాగం పరిధిలోని మండల స్టాక్ పాయింట్లు, రేషన్‌షాపుల ద్వారా ప్రజలకు కచ్చితమైన తూకంతో బియ్యం, సరుకులు అందించాల్సిన బాధ్యత డీలర్లు, ఎండీయూ యాజమానులపై ఉందని జిల్లా డీఎస్‌వో సత్యనారాయణరాజు అన్నారు. మండలంలోని పాతూరులోని మండల స్టాక్ పాయింట్ (ఎంఎల్‌ఎస్)ను ఆయన మంగళవారం తనిఖీ చేసారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణలో సరఫరా చేసే బియ్యం, కందిపప్పు, పామాయిల్ తూకాలను ఆయన పరిశీలించారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ కింద లబ్ధిదారులకు 9 రకాల సరుకులను వారికి ప్యాక్ చేసి పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనుందని, రేషన్ దుకాణాలకు ఎంఎల్‌ఎస్ పాయింట్ల ద్వారా కచ్చితమైన తూకంలో వాటిని పంపిణీ చేయాలని, రేషన్‌డీలర్లు ఇక్కడ తూకాలను కాటా వేసుకుని వేలిముద్ర వేయాలని, రేషన్ దుకాణాల నుంచి ఎండీయూ వాహన యాజమానులకు, ఎండీయూ సిబ్బంది రేషన్ పొందే లబ్ధిదారునికి కచ్చితంగా తూకం వేసి సరుకులు అందించాలన్నారు. రేషన్, నిత్యావసర సరుకులను సైతం కచ్చితమైన తూకంతో లబ్ధిదారులకు అందించాలన్నారు. లేని పక్షంలో వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా రేషన్‌డీలర్ల అసోసియేషన్ అధ్యక్షుడు తలారి రామకృష్ణ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయనకు వివరించారు. గత నెలలో ఐసీడీఎస్, ఎండీయూలకు సరుకులను అందించినప్పటికీ నేటికీ స్టాక్‌లో వ్యత్యాలు వచ్చాయని, దీని వల్ల డీలర్లు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆ సమస్యను పరిష్కరిస్తామని డీఎస్‌వో వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌వో రాంరెడ్డి, సీఎస్‌డీటీ ఏ.మాధవరావు, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కేఎస్‌వీ ప్రసాద్, ఉపాధ్యక్షుడు యు.జయరాజు, గోడౌన్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరి సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా సీఎం జగన్ కృషి

దెందులూరు: ప్రతి ఒక్కరి అభివృద్ధి, సంక్షేమం, సమస్యల పరిష్కారం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తొలిప్రాధాన్యత అంశాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి సొంత నిధులు రూ. 4లక్షలు, ఎంపీ కోటగిరి శ్రీధర్ నిధులు రూ. 3 లక్షలు, పేహ్యాన్ కాపీ లిమిటెడ్ రూ. 5 లక్షలు మొత్తం రూ. 12లక్షలతో దెందులూరులో దళితుల సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణ, సురక్షితమైన తాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో డ్రెయినేజీలు, రోడ్లు, యుద్ధప్రాతిపదికన ప్రాధాన్యతా క్రమంలో నిర్మిస్తామన్నారు. త్వరలో దెందులూరులో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. దెందులూరు అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. హైదరాబాద్‌లో ఉన్నప్పటికీ జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ ప్రసాద్ ఆర్వో ప్లాంట్ ప్రారంభోత్సవానికి రావడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఎంపీపీ నిధుల నుంచి రూ. 25 లక్షలతో నిర్మించనున్న సీసీ డ్రెయిన్లు, రూ. 14 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. గ్రామంలో పర్యటించి అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు తేరా ఆనంద్, విజయవాడ కనకదుర్గమ్మ ఆలయ కమిటీ బోర్డు డైరెక్టర్ తొత్తడి వేదకుమారి, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం, పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి, పార్టీ మండల అధ్యక్షుడ కామిరెడ్డి నాని, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పోకల రాంబాబు, మేకా లక్ష్మణరావు, దెందులూరు ఏఎంసీ డైరెక్టర్ పులిపాటి శ్యామలాదేవి, ఎంపీటీసీలు పులిపాటి ఆనంద్, తోట విజయకుమారి, తాళ్ళూరి నాగరాజు, గొరిపర్తి వరలక్ష్మి, పెద్దిశెట్టి రోహిణి, పార్టీ జిల్లా కార్యదర్శులు కట్టా ఏసుబాబు, చల్లా మేరీరాజు, కొంగర రత్నకుమార్ అబ్బాస్, పిళ్లెం శ్యాంతంబి, వన్నెకూటి సుందరం, గొరిపర్తిరంగారావు, డీఎస్‌పీ ప్రసాద్ (బజ్జీ), కొలుసు గణపతిరావు, నియోజకవర్గంలో నాలుగు మండలాల నుంచి ప్రజాప్రతినిధులు, సొసైటీ చైర్మన్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



దెందులూరులో దాతలు రూ.12 లక్షలతో నిర్మించిన మినరల్ వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న జెడ్పీచైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, ఫాదర్ అమ్మన్‌రాజా

ఎస్‌ఎఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైభవాన్ని చాటి చెబుదాం



పూర్వవిద్యార్థుల సమావేశంలో మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు ఈపూరి సత్యానారాయణ

ఉంగుటూరు: గ్రామీణ ప్రాంతంలో విద్యాభివృద్ధికి దివంగత మూర్తిరాజు స్థాపించిన అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైభవాన్ని చరిత్రను చాటి చెబుదామని పూర్వ విద్యార్థులు అన్నారు. కళాశాల స్థాపించి 50 సంవత్సరాలు, అరవిందుని 150వ జయంతి సందర్భంగా ఈనెల 12, 13 తేదీల్లో నిర్వహించనున్న ఉత్సవాలను విజయవంతం చేయాలని నిర్ణయించుకున్నారు. మంగళవారం కళాశాలలో పూర్వ విద్యార్థుల సమావేశం సంఘం అధ్యక్షుడు ఈపూరి సత్యానారాయణ అధ్యక్షతన నిర్వహించారు. సత్యనారాయణ మాట్లాడుతూ కళాశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థులు పాత్ర కీలకమైనదని అన్నారు.వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ప్రతి పూర్వ విద్యార్థి సహాయ సహకారం అందించాలని కోరారు. కార్యదర్శి బొమ్మిడి అప్పారావు మాట్లాడుతూ 1972 నుంచి ఇప్పటి వరకు ఈ కళాశాలలో చదుకున్న పూర్వ విద్యార్థులందరూ ఆగస్టు 12, 13 తేదీల్లో కళాశాలకు తప్పనిసరిగా వచ్చి వేడుకల్లో పాల్గొనాలని కోరారు. ప్రిన్సిపాల్ టీకే విశ్వేశ్వరరావు మాట్లాడుతూ న్యాక్ ప్రమాణాలతో కళాశాల మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు సిబ్బంది సిద్ధంగా ఉన్నామని అన్నారు.వేడుకలు జయప్రదం చేసేందుకు వివిధ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సమాశంలో పూర్వ విద్యార్థులు 60 మంది పాల్గొన్నారు. మహాత్మాగాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, పూర్వ విద్యార్థిని ఎంపీపీ గంటాశ్రీలక్ష్మి, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, నారాయణపురం సర్పంచి దిడ్ల అలకానంద, కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ యెలిశెట్టి బాబ్జి, పాతూరి సత్యనారాయణ, పుప్పాల గోపి పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ కోసం ఐక్య పోరాటం



రాయన్నపాలెంలో ఎస్సీవర్గీకరణ సాధన కోసం నినాదాలు చేస్తున్న ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నేతలు

పెదవేగి : మాదిగల చిరకాల వాంఛ ఎస్సీ వర్గీకరణ సాధనకు ఐక్య పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందని పెదవేగి మండలం ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు జొన్నకూటి జాన్ మాదిగ పిలుపునిచ్చారు. పెదవేగి మండలం రాయన్నపాలెంలో హలో మాదిగ చలో హైదరాబాద్ కార్యక్రమ కార్యచరణపై జాన్‌మాదిగ ఆధ్వర్యంలో చర్చించి అనంతరం ర్యాలీ నిర్వహించారు. మాదిగల జీవితాల్లో వెలుగులు నింపాలంటే వర్గీకరణ ఒక్కటే మార్గమని, ఇప్పటి వరకు ఒక వర్గానికే లబ్ధి చేకూరుతోందని అన్నారు. తండ్రి ఆస్తిని బిడ్డలు కలిసికట్టుగా పంచుకోవాలే తప్ప ఇలా అన్యాయం చేయకూడదని ఆవేదన వ్యక్తం చేశారు. సోదరులంతా ఐక్యతతో పోరాడి మాదిగల హక్కును కాపాడుకోవాలని జాన్ మాదిగ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు తనగాల శేఖర్ మాదిగ, దెందులూరు నియోజకవర్గ ఎంఆర్‌పీఎస్‌కో ఇంచార్జ్ యర్రా ఆనంద్ మాదిగ, ఎంఆర్‌పీఎస్ యువసేన యర్రా రఘు మాదిగ, ఎంఎస్‌పీ దెందులూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ మద్దాల తిరుపతిరావు, మండల అధ్యక్షుడు మికయేలు, ఉప్పులూరి ఎలీషా, డప్పుకళాకారుల బృందంచ గ్రామస్తులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ



దిబ్బగూడెం-లక్ష్మీపురంలో వృద్ధుడికి పింఛన్ అందిస్తున్న వలంటీర్



దివ్యాంగ పింఛన్ అందజేస్తున్న వలంటీర్ నెక్కలపు జ్యోతి

పెదవేగి: అవ్వా, తాతలకు పింఛన్ అందించేందుకు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పరుగులు తీసిన వలంటీర్లను చూసి అందరూ భళా అని ప్రశంసిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వలంటీర్‌ల ద్వారా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పింఛన్ పంపిణీ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందని ఎంపీడీవో జి రాజ్‌మనోజ్ అన్నారు. ఆగస్టు 1 తేదీన మండలంలోని అన్ని గ్రామాల కార్యదర్శులతో ఆధ్వర్యంలో వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు పింఛన్‌ను అందించారు. మంగళవారం ఉదయం ఇంటింటికీ తిరిగి పింఛన్‌లను లబ్ధిదారులకు అందజేశారు. మండల వ్యాప్తంగా 11,846 మంది లబ్ధిదారులు ఉండగా, రూ.32,96,575 పింఛను నగదు పంపిణీ చేసినట్టు ఎంపీడీఓ చెప్పారు.

పింఛన్ అందజేత

దెందులూరు: మండలంలోని అక్కిరెడ్డిగూడెం గ్రామంలో విభిన్న ప్రతిభావంతుడు బెజవాడ హర్షకు స్థానిక వలంటీర్ నెక్కలపు జ్యోతి మంగళవారం పింఛన్ అందజేశారు. ప్రభుత్వం నుంచి మంజూరైన పెన్షన్ నగదును ఆమె ఏలూరులోని వైద్యశాలలకు వెళ్లి లబ్ధిదారుడికి అందజేశారు. వలంటీర్ సేవలను హర్ష కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానికులు అభినందిస్తున్నారు.

నేడు ఆయిల్‌పామ్ మెగా మేళా

పెదవేగి : ఆయిల్‌పామ్ మెగా మేళా బుధవారం నిర్వహిస్తున్నట్లు మండల ఉద్యానశాఖ అధికారిణి ఎం రత్నమాల చెప్పారు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో మెగా ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ డ్రైవ్, ఆయిల్‌పామ్ మెగా మేళా పెదవేగి మండలం గార్లమడుగు పంచాయతీ పరిధిలో మధ్యాహ్నం 3 గంటలకు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, వ్యవసాయ, ఉద్యానవనశాఖ అధికారులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని హెచ్‌ఓ రత్నమాల కోరారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే వాసుబాబు
- కొత్త ఉంగుటూరు, నారాయణపురంలో గడపగడపకు మన ప్రభుత్వం



కొత్త ఉంగుటూరు, నారాయణపురంలో ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

ఉంగుటూరు: ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం కొత్త ఉంగుటూరు, నారాయణపురం వైఎస్సార్ కాలనీలో ఎమ్మెల్యే వాసుబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గడపగడపకు వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజలకు అందిన పథకాలను ఆయా కుటుంబాలకు వివరించారు. అనంతరం వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ సచివాలయం. వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు సత్వరం అందుతున్నాయని అన్నారు. పార్టీలకు, వర్గాలకు అతీతంగా అర్హులందరికీ పథకాలు అందిస్తున్నామన్నారు. విద్య, వైద్య రంగాలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యతనిస్తూ నిధులు కేటాయిస్తున్నారని అన్నారు. ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అందరూ అండగా నిలవాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, ఏఎంసీ మాజీ చైర్మన్ మరడ రమావతి, మండల కన్వీనర్ మరడ మంగరావు, సచివాలయాల కన్వీనర్ పెనుగొండ బాలకృష్ణ, ఉంగుటూరు ఎంపీటీసీ సందక రాంబాబు, దళిత విభాగం అధ్యక్షుడు గంటా లక్ష్మణరావు, సచివాలయ ఉద్యోగులు, మండల స్థాయి అధికార్లు పాల్గొన్నారు.

నేడు కైకరంలో గడపగడపకు మన ప్రభుత్వం

ఉంగుటూరు: గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం బుధవారం ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఆధ్వర్యంలో కైకరంలో నిర్వహిస్తారని వైసీపీ మండల కన్వీనర్ మరడ మంగరావు తెలిపారు. 185 వరోజు జరిగే ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు, అధికార్లు పాల్గొనాలని ఆయన కోరారు.

పంటల వివరాలు ఈ-క్రాప్‌లో నమోదు



ఈ- పంట నమోదుపై అవగాహన కల్పిస్తున్న ఏవో ఉషారాణి, తహసీల్దార్ ఇందిరాగాంధీ

భీమడోలు: రైతులు పండించే ప్రతి పంటను ఈ- క్రాప్ నమోదు చేయాల్సిన బాధ్యత వ్యవసాయ, రెవెన్యూ సిబ్బందిపై ఉందని మండల వ్యవసాయాధికారిణి ఎస్‌పీపీ ఉషారాణి అన్నారు. భీమడోలు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం రాత్రి ఈ పంట నమోదుపై వీఆర్వోలు, వ్యవసాయ సహాయకులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఏవో ఉషారాణి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దార్ ఎం.ఇందిరాగాంధీ మాట్లాడుతూ ఈ- పంట నమోదుపై ప్రభుత్వం సూచనలను విధిగా పాటించాలన్నారు. ఏవో ఉషారాణి మాట్లాడుతూ మండలంలో 13,700 ఎకరాల్లో 4900 మంది రైతులు వరి సాగు చేస్తున్నారన్నారు. వాటిలో 80శాతం మంది కౌలు రైతులు ఉన్నారన్నారు. ఈ పంట నమోదు కార్యక్రమంలో ఈ వారంలో ప్రారంభమవుతుందన్నారు. వీఆర్వోలు కె.శంకర్, సింహాచలం, శేషుకుమార్, గోవింద్, వెంకటేశ్వరరావు, వీఏఏలు పాల్గొన్నారు.

చెరువుల వేలంతో రూ.72 లక్షల ఆదాయం

ఉంగుటూరు: ఉంగుటూరు గ్రామ పంచాయతీలో విస్తరించి ఉన్న చెరువులు, కొబ్బరి మొక్కలు లీజుకు నిర్వహించిన వేలం ద్వారా రూ.72 లక్షల ఆదాయం వచ్చిందని పంచాయతీ కార్యదర్శి గిరిధర్ తెలిపారు. వారం రోజులుగా మూడు దఫాలుగా నిర్వహించిన వేలంలో కొత్త కోనేరు చెరువుకు రూ.40 వేలకు, జువ్వలగుంట చెరువు రూ.3.50 లక్షలు, దిరిశానిగుంట చెరువు రూ.7,05 లక్షలు, కేతాయి చెరువుకు రూ.2.35 లక్షలు, కోనేరు చెరువుకు రూ.2.05 లక్షలు, చెల్లువాని చెరువుకు రూ.4.62 లక్షలు, కసానిగుంట చెరువుకు రూ.4.60, అబ్బినీడి చెరువుకు రూ.1.70 లక్షలు, నల్లచెరువుకు రూ.7.29 లక్షలు, యర్రచెరువుకు రూ.33.20 లక్షలు, బియ్యపుగుంటకు రూ.2.99 లక్షలు, కేతాయి చెరువుకు రూ.2.10 లక్షలు మూడేళ్ల కాలపరిమితికి లీజు చెల్లించేలా పాటదారులు వేలం దక్కించుకున్నారని అన్నారు. గ్రామ పంచాయతీ సర్పంచి బండారు సింధు, ఈవో పీఆర్డీ షంషుద్దీన్ పర్యవేక్షణలో వేలం నిర్వహించినట్టు ఈవో గిరిధర్ వివరించారు.

రాధా సహిత వేణుగోపాలస్వామి కల్యాణం

ఉంగుటూరు: ఉంగుటూరు మండలం కైకరం షిర్డీ ఆలయంలో రాధా సహిత వేణు గోపాలస్వామి కల్యాణం మంగళవారం వైభవంగా నిర్వహించారు. పెద్ద గణేష్ లక్ష్మి దంపతులు పీటలపై కూర్చున్నారు. గ్రామానికి చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు.

3న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

దెందులూరు: దెందులూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత అధ్యక్షతన 3వ తేదీన నిర్వహించనున్నట్టు దెందులూరు ఎంపీడీఓ ఏబీపీవీ లక్ష్మి తెలిపారు. ఉదయం 10.30 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో జరిగే సమావేశంలో ఎంపీటీసీలు, అన్ని శాఖల మండలాధికారులు విధిగా హాజరుకావాలని అధికారులు వారి శాఖకు సంబంధించి పూర్తి సమాచారంతో రావాలన్నారు.

వీఆర్‌ఏలను ప్రభుత్వం ఆదుకోవాలి

పెదవేగి : తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించి ప్రభుత్వం ఆదుకోవాలని వీఆర్‌ఏల జిల్లా సంఘం కోశాధికారి టీ గంగాధర్ రావు కోరారు. వీఆర్‌ఏల రాష్ట్ర సంఘం పిలుపుమేరకు ఈనెల 7, 8 తేదీల్లో కలెక్టరేట్ల వద్ద ధర్నా చేయడానికి పెదవేగి మండలం వీఆర్‌ఏల సంఘం సంఘీభావం తెలుపుతున్నామని చెప్పారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల వీఆర్‌ఏలతో సమావేశం నిర్వహించారు. వీఆర్‌ఏల రాష్ట్ర సంఘానికి తమ పూర్తి మద్దతు తెలియజేస్తున్నామని అన్నారు.ఈనెల 25న అమరావతిలో చేపట్టబోయే జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని జయప్రదం చేయడానికి మా సంపూర్ణ మద్దతును తెలియజేస్తున్నామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వీఆర్‌ఏల సంఘం గౌరవ అధ్యక్షుడు ఆర్ వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షుడు పి రామకృష్ణ, ట్రెజరర్ జయ రామకృష్ణ, షకీలా, రమేష్ పాల్గొన్నారు.



సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

దెందులూరు, ఉంగుటూరు
9912220559
90102 23729
63097 62918
Office mail : tpgadvt@gmail.com